క్లుప్తంగా

విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేయొద్దు


నారాయణ, యూటీఎఫ్ నేత

ఆకివీడు: విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసే విధంగా కూటమి విద్యా సంస్కరణలు ఉన్నాయని యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి ఆర్‌వీఎస్ నారాయణ ఆందోళన వ్యక్తం చేశారు. స్థానికంగా ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మోడల్ స్కూల్ ప్రధానోపాధ్యాయులుగా స్కూల్ అసిస్టెంట్లను నియమించడం అశాస్త్రీయమైన నిర్ణయమని, తక్షణం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థి నిష్పత్తిని 1:35గా 45 తరువాత 2వ విభాగం అమలు చేయాలన్నారు. ఉపాధ్యాయ పోస్టులను బ్లాక్ చేయడం సరైన పద్ధతి కాదని, బదిలీల్లో అన్ని ఖాళీలను చూపించాలన్నారు. ఆయా సమస్యల పరిష్కారానికి మే 21న జిల్లాలోని విద్యాశాఖ కార్యాలయాన్ని ముట్టడి చేసేందుకు ఉపాధ్యాయులు, ఐక్య ఉపాధ్యాయ సంఘాల నేతలు హాజరవ్వాలని వారు విజ్ఞప్తి చేశారు.

మూగ జీవాలకు నీటి తొట్టెలు


మూగ జీవాలకు నీటి తొట్టెలు సిద్ధం చేస్తున్న మిత్ర బృందం సభ్యులు

భీమవరం: మండు వేసవిలో మూగజీవాల దాహార్తిని తీర్చేందుకు గో–సంరక్ష సమితి అధ్యక్షుడు సుంకర దాసు మిత్ర బృందం ప్రధాన సెంటర్లలో ఆలయాల వద్ద నీటి తొట్టెలు పెట్టే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సుంకర దాసు మాట్లాడుతూ కొన్ని సంవత్సరాలుగా ఈ కార్యక్రమం నిర్వహిస్తూ వస్తున్నామని, ఈ ఏడాది సిమెంట్‌తో తయారు చేసిన 200 నీటి తొట్టెలను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. వేణు ఆర్ట్స్ సౌజన్యంతో తొట్టెలకు మూగ జీవులను రక్షిద్దాం అనే నినాదంతో రంగులు వేసి ఆకర్షణీయంగా తయారు చేస్తున్నారని, మనసున్న ప్రతి ఒక్కరూ మన ఒంతుగా ఈ తొట్టెల్లో నీటిని ఉంచాలని, ఆసక్తి ఉన్న జంతు ప్రేమికులకు నీటి తొట్టెలను అందిస్తున్నామన్నారు. దయచేసి వీటిని డస్ట్ బిన్లుగా ఉపయోగించొద్దని మనవి చేశారు. త్వరలో జిల్లా కలెక్టర్, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారుల చేతుల మీదుగా పంపిణీ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో అల్లు శ్రీనివాస్, అశోక్ యాదవ్, కళ్యాణ్ డిన్ను, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమావేశ వాల్ పోస్టర్ ఆవిష్కరణ


వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించిన ఉద్యోగ సంఘు నాయకులు

ఆకివీడు: ఏపీ ఉగ్యోగుల సంఘ రాష్ట్ర కౌన్సిల్ సమావేశం జూన్ 5వ తేదీన విజయవాడలో నిర్వహిస్తామని జిల్లా అధ్యక్షుడు జీఆర్‌ఎస్‌ఎన్ రాజు తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం రాత్రి తాలూకా యూనిట్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న రాజు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర కౌన్సిల్ సమావేశం దోహదపడుతుందన్నారు. అనంతరం 2025–28 సంవత్సరానికి నూతన కమిటీ ఏర్పడింది. కమిటీ ఎన్నికల అధికారిగా వై.మోహనరావు, జక్కరయ్య వ్యవహరించారు. ఆయా పదవులకు ఒక్కో నామినేషన్ రావడంతో ఎన్నిక ఏకగ్రీవమైందని కార్యదర్శి ఎన్.ప్రకాష్‌బాబు చెప్పారు. అధ్యక్షుడిగా జి.చిట్టి బాబు, అసోసియేట్ అధ్యక్షురాలిగా ఎంఆర్‌పీ ప్రియాంక, ఉపాధ్యక్షులుగా అహ్మద్ ఫరూక్, పాల్సన్, బి.అశోక్, టి.జయరాజు, టి.మణిదీప్, కార్యదర్శిగా ఎస్.ప్రకాష్‌బాబు, సహాయ కార్యదర్శులుగా ఎండీ బషీరాబాను, కె.మోహన్, జి.అనిల్, జి..సుధాకర్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా బి.గంగాధరరావు, కోశాధికారిగా ఎం.సుందర్‌పాల్ ఎన్నికైనట్లు ప్రకటించారు.

ఇంటికే ఉచిత వైద్యం


వృద్ధురాలికి వైద్య సేవలందిస్తున్న వైద్యులు

తణుకు అర్బన్: సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్తంగా ఇంటింటికీ వైద్య సేవలు ఆదివారం నిర్వహించారు. తణుకు, పైడిపర్రు, చివటం ప్రాంతాల్లో ప్రత్యేక వాహనం ద్వారా వెళ్లిన ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ హుస్సేన్ అహ్మద్ 6గురు వృద్ధులకు ఉచిత వైద్య సేవలు అందజేశారు. సభ్యులు కె.రామమోహనరావు ఆర్థిక సాయంతో ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు అల్లూరి కరుణాకర చౌదరి తెలిపారు. ఉచిత వైద్య సేవలు అవసరమైన వారు 99853 43530, 90592 90717 నంబర్లలో సంప్రదించాలని కోరారు. సభ్యులు వడ్లమాని పార్వతి పాల్గొన్నారు.

పూర్తవుతున్న ఆలయాల పునర్నిర్మాణం

- వైఎస్ జగన్ హయాంలో దాదాపు పూర్తి
- శ్రీరామలింగేశ్వరస్వామి దేవస్థానానికి రూ.కోటి నిధులు
- పట్టణంలో రెండు దేవస్థానాల పునర్నిర్మాణం


పునర్నిర్మించిన శ్రీరామలింగేశ్వర స్వామి దేవస్థానం


పునర్నిర్మాణం చేసిన శ్రీసీతారామలింగేశ్వర స్వామి దేవస్థానం

భీమవరం(ప్రకాశం చౌక్): దేవదాయశాఖకు చెందిన పురాతన ఆలయాల అభివృద్ధి లక్ష్యంగా గత ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేవస్థానాల జీర్ణోద్ధరణ కార్యక్రమాన్ని చేపట్టి దెబ్బతిన్న ఆలయాలు, వాటి ప్రాంగణాలు, పునర్నిర్మాణం చేసి ఆలయాలకు పూర్వ వైభోగం సంకల్పించారు. నాడు ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేసి నూతన ఆలయాలను నిర్మించే దైవ కార్యక్రమం చేశారు. నిర్మాణం చేస్తున్న ఆలయాలకు ప్రభుత్వం నుంచి సీజీఎఫ్ గ్రాంట్ (కామన్ గుడ్ ఫండ్) నుంచి నిధులు మంజూరు చేశారు. ఆలయాల నిర్మాణానికి అయ్యే ఖర్చులో 67 శాతం నిధులు ప్రభుత్వం అందించగా 33 శాతం మ్యాచింగ్ కంట్రిబ్యూషన్ దేవస్థానం తరపున ఖర్చు చేశారు. దీనిలో భాగంగా భీమవరం నియోజకవర్గంలో నాలుగు దేవస్థానాల పునర్నిర్మాణం చేశారు.

రూ.2.93 కోట్ల ఖర్చు

భీమవరం నియోజకవర్గంలో నాలుగు దేవస్థానాలు పునర్నిర్మాణానికి నాడు వైఎస్ జగన్ ప్రభుత్వంలో రూ.2,93,32000 నిధులు ఖర్చు చేశారు. పట్టణంలోని శ్రీరామలింగేశ్వరస్వామి దేవస్థానం (సుబ్బరాయుడి గుడి)కి రూ.కోటి రూపాయలు, శ్రీసీతారామలింగేశ్వరస్వామి దేవస్థానానికి రూ.66 లక్షలు, కొమరాడ శివకేశస్వామి దేవస్థానానికి రూ.66 లక్షలు నవుడూరు రామలింగేశ్వరస్వామి దేవస్థానానికి రూ.60 లక్షలు నిధులు కేటాయించారు. వాటిలో భీమవరంలోని శ్రీరామపురం శ్రీరామలింగేశ్వరస్వామి దేవస్థానం, ప్రభుత్వ ఆసుపత్రి సమీపాన ఉన్న శ్రీసీతారామలింగేశ్వరస్వామి దేవస్థానం పునర్నిర్మాణం పూర్తి కావడంతో ఇటీవల ఈ రెండు దేవస్థానాలు పున:ప్రతిష్ఠ పూర్తి చేశారు. కొమరాడ శివకేశవ స్వామి దేవస్థానం, నవుడూరు శ్రీరామలింగేశ్వరస్వామి దేవస్థానం నిర్మాణంలో ఉన్నాయి. ఆలయాల నిర్మాణానికి ప్రభుత్వం ఇచ్చిన సీజీఎఫ్ గ్రాంట్ కాకుండా దాతలు ఆర్థిక సాయాన్ని అందించారు.

2014–2019 మధ్య దేవస్థానాల అభివృద్ధి శూన్యం

గతలో 2014 నుంచి 2019 వరకు చంద్రబాబు పాలనలో దేవస్థానాల అభివృద్ధి శూన్యం. దేవస్థానాల ఆస్తులు, భూముల నుంచి ఆదాయం తీసుకోవడం తప్పా శిథిలావస్థలో ఉన్న, దెబ్బతిన్న ఆలయాల పునర్నిర్మాణం గురించి చంద్రబాబు పట్టించుకోలేదు. గత ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కరోనా విపత్తు తరువాత మూడేళ్లలో దేవస్థానాల అభివృద్ధి చేపట్టారు. ఆదాయం ఉన్నా లేకున్నా వాటి అభివృద్ధిని బాధ్యతగా తీసుకున్నారు.

గత ప్రభుత్వంలో ఆలయాలకు మహర్దశ



గత ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ఆలయాలకు మహర్దశ పట్టించారు. పట్టణంలో రెండు దేవస్థానాలకు నాడు నిధులు కేటాయించారు. అలాగే దాతలు కూడా ఆర్థిక సాయం అందిచడంతో వేగంగా ఆలయాలను పునర్నిర్మించారు. పట్టణంలోని రెండు ప్రముఖ దేవాలయాలకు నూతన ఆలయాలను నిర్మించడం సంతోషించదగ్గ విషయం.

–మారోజు గణేష్ భీమవరం

హెల్మెట్ వాడకంపై అవగాహన


కాళ్లకూరులో వాహనదారుడుకి హెల్మెట్ పెడుతున్న ఎస్సై శ్రీనివాసరావు

కాళ్ల: రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు హెల్మెట్ ఉపయోగపడుతుందని, వాహనదారులు హెల్మెట్ ధరించాలని కాళ్ల ఎస్సై ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని కాళ్లకూరు గ్రామంలో ఆదివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించి వాహన చోదకులకు హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పించారు. అనుకోని పరిస్థితుల్లో జరిగే ప్రమాదాల్లో హెల్మెట్ ఉండడం వలన ప్రాణాపాయ స్థితి నుంచి బయటపడ్డ ప్రాణాలు అనేకం ఉన్నాయని, హెల్మెట్ ధరించాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా దండు గంగాలమ్మ జాతర


అమ్మవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు


దండు గంగాలమ్మ అమ్మవారు

పాలకోడేరు: మండలంలోని పెన్నాడ అగ్రహారంలో వేంచేసియున్న దండు గంగాలమ్మ జాతర మహోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మ వారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. సలిమిడి పానకాలతో కొబ్బరికాయలు సమర్పించుకుని భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. గ్రామ పురవీధుల్లో అమ్మవారిని గరగ నృత్యాలు, మేళతాళాలతో, శక్తి వేషాలు, కోయ నృత్యాలు, బాణసంచాతో ఊరేగించారు. సోమవారం అన్న సమారాధన నిర్వహిస్తామని కమిటీ తెలిపింది.

21న యూపీఎఫ్ సమావేశం

ఉండి: యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్(యూపీఎఫ్) మండల సమావేశం ఈ నెల 21వ తేదీ బుధవారం ఉదయం 9 గంటలకు ఉండి శివారు నక్కరాజు గుంట క్రీస్తు సంఘ చర్చిలో బ్రదర్ తెనాలి సుధాకర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.పీటర్, వై.యోనాతాను తెలిపారు. యూపీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బ్రదర్ మేడిద జాన్సన్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ సమావేశానికి సభ్యులు తప్పక హాజరు కావాలని కోరారు.

ప్రశాంతంగా జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షలు

తాడేపల్లిగూడెం (టీటీసీ): దేశ వ్యాప్తంగా ఐఐటీల లో ప్రవేశాలకు గాను నిర్వహించే జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షలు తాడేపల్లిగూడెంలోని రెండు కేంద్రాల్లో ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. శశి ఇంజనీరింగ్, వాసవీ ఇంజనీరింగ్ కాలేజీల్లో ఈ పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయగా, రెండు షిఫ్టుల్లో పరీక్షలు నిర్వహించారు. శశి కాలేజీ పరీక్ష కేంద్రంలో షిఫ్టుకు 240 మంది చొప్పున హాజరుకావాల్సి ఉండగా, రెండు షిఫ్టులకు కలిపి 480 మందికి 478 మంది హాజరయ్యారు. వాసవీ కాలేజీలో 136కి 135 మంది పరీక్షలకు హాజరైనట్టు అధికారులు తెలిపారు. ఐఐటీ మద్రాస్ ప్రొఫెసర్ మూర్తి, టెస్ట్ సెంటర్ అడ్మినిస్ట్రేటర్ నటరాజ్, సిస్టంఅడ్మిన్ కొల్లా సురేష్, టీసీఎస్ సంస్థ ప్రతినిధులు పర్యవేక్షించారు.

మట్టి ట్రాక్టర్లతో వాహనదారుల పాట్లు


మట్టి రవాణాతో బురదమయంగా మారిన పాలకోడేరు-వేంద్ర రహదారి


భీమవరం-అత్తిలి రోడ్డు మోగల్లు వద్ద చిత్తడిగా మారడంతో ఇబ్బంది పడుతున్న వాహనదారులు →

పాలకోడేరు: మండలంలోని మోగల్లు, పాలకోడేరు, గరగపర్రు, గొల్లలకోడేరు, కుముదవల్లి, వేంద్ర, కొండేపూడి, పెన్నాడ, విస్సాకోడేరు, శృంగవృక్షం తదితర గ్రామాల్లో నిబంధనలకు విరుద్ధంగా మట్టిని ఇష్టానుసారంగా రవాణా చేస్తున్నారు. మట్టి రవాణా చేస్తున్నప్పుడు లోడు ట్రాక్టర్ ట్రక్కులపై కనీసం బరకాలు కూడా కప్పకుండా యథేచ్ఛగా అతివేగంతో ట్రాక్టర్లు లారీలతో రవాణా చేస్తున్నారు. లోడు మట్టి వాహనాల వెనుక ప్రయాణిస్తున్న వాహనదారులపై మట్టి గడ్డలు పడడంతో ప్రమాదాలకు గురవుతున్నారు. రోడ్లపై పెద్ద పెద్ద మట్టి గడ్డలు పడిపోవడంతో ఆదివారం కురిసిన వర్షానికి రోడ్లన్నీ బురద మయమై వాహనదారులు బైక్‌లతో పాటు జారి పడిపోయారు. ఈ క్రమంలో చాలా మందికి గాయాలయ్యాయి. నిబంధనలకు విరుద్ధంగా మట్టిని తోలే వ్యాపారం అరికట్టవలసిన అధికారులు వ్యాపారుల వద్ద ముడుపులు అందుకుని ఏమీ తెలియనట్టు ఉంటున్నారని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆయా గ్రామాల్లో వీఆర్వోలు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకోవడం లేదని ప్రజలు, ప్రయాణికులు వాపోతున్నారు. దీనిపై రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాఘవ రాజు స్పందిస్తూ నిబంధనలకు విరుద్ధంగా మట్టి రవాణా అరికట్టేందుకు వీఆర్వోలకు ఆదేశాలు ఇస్తామన్నారు. దీనిపై తహసీల్దార్ నడింపల్లి భారతీవిజయలక్ష్మిని వివరణ కోరగా వెంటనే చర్యలు చేపడతామని తెలిపారు.

భూగర్భ జలాలను తోడేస్తున్నారు

విచ్చలవిడిగా బోర్లు వేస్తున్నా పట్టించుకోని అధికారులు


యండగండిలో బహిరంగంగానే బోరు వేస్తున్న ఆక్వా రైతు

ఉండి: ఆక్వా సాగులో అక్రమాలకు అంతులేదన్నట్లుగా సాగుతుంది మండలంలోని తీరు. బోర్లు వేసి ఉప్పునీటితో ఆక్వా సాగు చేయకూడదంటూ ఓ వైపు అధికారులు ఆదేశాలిస్తున్నా నూటికి 90 శాతం మంది ఆక్వా రైతులు బోర్లు వేసి ఉప్పు నీటితోనే సాగు చేస్తున్నారు. ఆక్వా రైతులు ఎంతగా అధికారులపై అజమాయిషీ చలాయిస్తున్నారని చెప్పేందుకు యండగండిలో జరుగుతున్న బోరు త్రవ్వకం ఓ ఉదాహరణ. బోరు వేస్తున్న సంగతిని స్థానికులు గ్రామ వీఆర్వోకు చేరవేస్తే సదరు అధికారి ఆక్వా చెరువు యజమానిని ఆరా తీశారు. అయితే సదరు రైతు మాత్రం మీరే మాకు అనుమతులిచ్చారు కదా ఇప్పుడెందుకు ఆపాలంటూ అధికారిపై అడ్డం తిరిగాడు. అంటే మండలంలో అధికారుల తీరు ఈ విధంగా ఉంటే భూగర్భ జలాలే కాదు ఏదైనా తోడేస్తారని పలువురు విమర్శిస్తున్నారు. అడ్డుకోవలసిన అధికారులు చేతులెత్తేస్తుంటే దీని వెనుక ఉన్న పరమార్థం ఏమిటోనని ప్రజలు గుసగుసలాడుతున్నారు. అయితే కళ్ల ముందు ఇంత జరుగుతున్నా దానిని ఆపేందుకు గాని అనుమతి లేకుండా బోరు వేస్తున్న రైతుపై చర్యలు తీసుకునేందుకు గాని అధికారులు ముందుకు రాకపోవడంతో పలు అనుమానాలకు తావిస్తుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి

తాడేపల్లిగూడెం (టీటీసీ): తిరుపతి జిల్లా, చంద్రగిరి సమీపంలోని ఇంజనీరింగ్ కళాశాలలో చదువుతున్న దళిత విద్యార్థి జేమ్స్‌ను అదే కళాశాలలో చదువుతున్న మరో ఉన్నత కులానికి చెందిన విద్యార్థి యశ్వంత్ తరుచూ కులం పేరుతో దూషించడంతో పాటు దాడులు చేస్తున్నాడని, తక్షణమే యశ్వంత్‌పై చర్యలు తీసుకోవాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు కోరారు. పట్టణంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో మంగరాజు మాట్లాడుతూ ఘటనలో జేమ్స్ పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని వాపోయారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ అమలు చేయాలని కోరారు. అడిదల రాజబాబు, జోసెఫ్, మోషే, తదితరులు మాట్లాడారు.

ప్రమాదకరంగా కాలిబాట వంతెనలు


దూసనపూడిలో ప్రమాదకరంగా ఉన్న వంతెన


వీరవాసరంలో రక్షణ గోడలు లేని వంతెన

- ఆందోళనలో ప్రయాణికులు
- పట్టించుకోని అధికారులు

వీరవాసరం: పంట కాలువలపై నిర్మించిన వంతెనలకు రక్షణ గోడలు లేకపోవడంతో రాకపోకలు సాగించే సమయంలో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. వీరవాసరం ప్రధాన పంట కాలువపై వీరవాసరం వెలమపేట నుంచి బాలేపల్లి రహదారికి వెళ్లడానికి వేసిన కాలిబాట వంతెన రక్షణ గోడలు లేకుండా పోయాయి. వంతెన సైతం పెచ్చులూడి శిథిలావస్థకు చేరుకుంది. నిత్యం ఆ ప్రాంతవాసులు ముఖ్యంగా రైతాంగం ఈ కాలిబాట వంతెన ద్వారా పెద్ద సంఖ్యలో ప్రయాణాలు సాగిస్తుంటారు. సైకిల్, మోటార్ సైకిల్‌పై ప్రయాణించే సమయంలో కాలువలు పడిపోయిన సంఘటనలు కోకొల్లలు. సుమారు 15 సంవత్సరాలకు పూర్వం నిర్మించిన ఈ కాలిబాట వంతెనలు శిథిలావస్థకు చేరుకోవడంతో కొత్తగా మరో వంతెన నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అవస్థలు పడుతున్న విద్యార్థులు

దూసనపూడి పంట కాలువపై సుమారు 15 సంవత్సరాల క్రితం కాలిబాట వంతెన నిర్మించారు. ప్రస్తుతం ఆ వంతెన పెచ్చులూడి శిథిలావస్థకు చేరుకుంది. రక్షణ గోడలు కూడా శిథిలమైపోయాయి. ఆ వంతెనపై ప్రయాణించే సమయంలో ఒకరికొకరు తోడుగా చేతులు పట్టుకుని మరీ వెళ్లాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని ఆ ప్రాంతవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలకు వెళ్లే విద్యార్థులు సైతం వంతెన పైనుంచి వెళ్లి జారి పడి కాలువలో పడి పుస్తకాలు, బ్యాగులను తడుపుకుంటూ మరలా ఇంటికి తిరిగి వచ్చిన సంఘటనలు పలుమార్లు చోటు చేసుకున్నాయని ఆ ప్రాంతవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత శాఖ అధికారులు తక్షణమే స్పందించి కాలిబాట వంతెన నిర్మాణాన్ని పూర్తి చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

కొత్త వంతెన నిర్మించాలి



పంట కాలువలపై వేసిన కాలిబాట వంతెనలు శిథిలావస్థకు చేరుకున్నాయి. వంతెన పై ప్రయాణించాలంటేనే భయభ్రాంతులకు గురవుతున్నాం. వీరవాసరం మార్కెట్ సెంటర్ నుండి వెలమపేట మీదుగా బాలేపల్లి వెళ్లడానికి ఈ రహదారి వంతెన గుండానే ప్రయాణిస్తుంటాం. వంతెనకు రక్షణ గోడలు లేక మోటర్ సైకిల్ ని నడిపించుకుంటూ వెళ్లి కాలువ దాటుతున్నాం. సంబంధిత శాఖ అధికారులు తక్షణమే కొత్త వంతెన నిర్మించాలి.

–పడవల నాని, బాలేపల్లి

పూడికతీత పనులే జీవనాధారం

- ఏళ్లుగా శ్రమిస్తున్న సారెమ్మ ముఠా
- పూడుకుపోయిన డ్రెయినేజీల్లో మట్టి తొలగింపు



డ్రెయినేజీలో పూడిక తొలగిస్తున్న సారెమ్మ ముఠా కూలీలు

ఆకివీడు: డ్రెయినేజీల్లో ఏళ్ల తరబడి పూడుకుపోయిన మట్టిని తొలగించడంలో సారెమ్మ ముఠా ఆరి తేరింది. తాడేపల్లిగూడేనికి చెందిన ఈ ముఠా కూలీలు గత 10 రోజులుగా స్థానిక నగర పంచాయతీ పరిధిలోని ప్రధాన డ్రెయిన్లలో మురుగును తొలగిస్తున్నారు. సుమారు నలభై ఏళ్ల క్రితం నిర్మించిన డ్రెయిన్లలో ఎప్పటికప్పుడు పైపైనే మట్టిని, పాలిథీన్ వ్యర్థాలను తొలగించి స్థానిక పంచాయతీ సిబ్బంది పనులను ముగిస్తున్నారు. దీంతో మూడు నుంచి నాలుగు అడుగుల లోతులో ఉన్న డ్రెయిన్లలో రెండు, మూడు అడుగుల లోతులో పూడికలు పేరుకుపోయాయి. ఎప్పటికప్పుడు పూడిక మట్టిని తొలగించకపోవడంతో డ్రెయిన్లలో నీటి పారుదల మందగించింది. దుక్కి వర్షానికే ప్రధాన రహదారితో పాటు, పలుచోట్ల పట్టణంలోని డ్రెయిన్లలో వర్షపు నీరు బయటకు చొచ్చుకు వెళ్లకుండా ముంపునకు గురి చేస్తున్నాయి.

కౌన్సిల్ సమావేశంలో నిర్ణయం

డ్రెయిన్లలో పూడిక తీత పనులు చేపట్టేందుకు నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం నిర్ణయించారు. ఈ మేరకు యంత్రాల పనులకు రూ.6.60 లక్షలతోనూ, కూలీలతో చేపట్టే పనులకు రూ.2.70 లక్షలతో టెండర్లు పిలిచారు. కూలీల పనులను సారెమ్మ ముఠా టెండర్లు ఖరారు కావడంతో పనులు ప్రారంభించారు. గత పది రోజులుగా ప్రధాన సెంటర్ నుంచి గుమ్ములూరు సెంటర్ వరకూ డ్రెయిన్లలో ఇరువైపులా పూడిక పనులు చేపట్టడంతో ట్రాక్టర్ల కొద్దీ మట్టిని బయటకు తీశారు. డ్రెయిన్ల అడుగు మట్టాలు కన్పించేంత వరకూ మట్టి తొలగించడంతో నీటి పారుదలకు మార్గం సుగమమైంది. తొలగించిన మట్టిని ట్రాక్టర్ల ద్వారా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ప్రధాన డ్రెయిన్‌తో పాటు స్థానిక మూలలంక బోదె, అందేవారి బోదె పక్కా డ్రెయిన్లలో పూడికలు తీసేందుకు పొక్లెయినర్‌తో పనులను వేగవంతంగా చేయిస్తున్నారు. రైల్వే ఫీడర్ రోడ్డు, సమతానగర్‌లోని గంగానమ్మ కోడు, అందేవారి బోదెల్లో పూడిక పనులను పొక్లెయినర్‌తో చేస్తున్నారు.

తీరనున్న ముంపు బెడద



పట్టణంలోని పలు డ్రెయిన్లలో పూడిక తీత పనులు గత కొన్ని దశాబ్దాలుగా చేపట్టలేదు. పారిశుద్ధ్య కార్మికులు చేస్తున్న పనులకు డ్రెయిన్లలో మట్టి తొలగకపోవడంతో ప్రత్యేక టెండర్ వేసి పనులు చేయిస్తున్నాం. టన్నుల కొద్దీ పూడిక మట్టి వస్తుంది. రూ.9.30 లక్షలతో పూడిక తీత పనులను చేపట్టాం. ప్రధాన డ్రెయిన్లలో కూడా పూడిక మట్టి తొలగించి, వర్షపు నీరు నిలబడకుండా చర్యలు తీసుకుంటున్నాం. బోర్డు సహకారంతో పట్టణాన్ని పారిశుద్ధ్య సహిత పట్టణంగా అభివృద్ధి చేస్తాం.

–జామి హైమావతి, వైస్‌పర్సన్, నగర పంచాయతీ, ఆకివీడు